


# 'ఎవరైతేనేం?'

### వై. విజయశ్రీ

విద్యార్థినుల కథా రచనల పోటీలో విద్యార్థినులు అసంఖ్యాకంగానే పాల్గొన్నారు — అందుకు సంతోషం. అయితే, వారిలో రచన చెయ్యాలన్న ఆసక్తి బాగా కనిపిస్తున్నదే గాని—ఇతివృత్తానికో, శిల్పానికో ప్రాధాన్యత ఇచ్చి రచన చెయ్యడంలో మాత్రం బాగా కృషి చెయ్యాల్సివుంటుందని—న్యాయనిర్ణేతలు అభిప్రాయపడ్డారు. వచ్చినవాటిలో ఉత్తమంగా తోచిన మూడు కథలను ఎన్నుకుని, వాటిలో ఒకటి, రెండు, మూడు స్థానాలలో మూడు కథలను నిర్ణయించారు.

మొదటి బహుమతి రూ. 100 లు పొందిన కథ:

"ఎవరైతేనేం?"

ఈ కథను అమరావతిలోని రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు కళాశాలలో బి. ఎ (మూడవ సంవత్సరం) చదువుతున్న — వై. విజయశ్రీ రాశారు.

రెండవ బహుమతి (రూ. 75) పొందిన "వాసనలేని పూవు"ను — డి. సుజాతారాణి రాశారు. హైద్రాబాదులోని సరోజినీనాయుడు వనితా మహావిద్యాలయలో ఈమె ఇంటర్ తొలిసంవత్సరం చదువుతున్నారు.

మూడవస్థానంలో బహుమతి (రూ. 50)ని పొందిన కథ-'సబల'. యమ్. శ్యామల — ఈ కథ రాశారు. హైద్రాబాద్‌లోని ఆర్ట్ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ విమెన్ (ఆంధ్ర మహిళా సభ) లో ఈమె బి. ఎ. మొదటి తరగతి చదువుతున్నారు.

వీరిని అభినందిస్తూ — మొదటి బహుమతి పొందిన కథను ఇక్కడ ప్రచురిస్తున్నాము. తక్కిన రెండు కథలూ, తర్వాత రెండు సంచికలలోనూ వస్తాయి. [వ. సం.]

ఆవుదగ్గర నిలబడి పరీక్షించటం—కొడుకు దూడతో పాటు గంతులువేయటం చూశాడు. దూడ మెడలోని మువ్వలు చూడగానే అంత వరకూ అణచుకున్న కోపం పెల్లుబికింది.

"ఎవర్రా దాని మెడలో మువ్వలు కట్టింది? అదేమన్నా కోడెదూడా! రేపు అవునమ్మేద్దాం. మువ్వలు విప్పండి!"

దూడ మెడలోని మువ్వలు అది ఎగురుతున్నప్పుడల్లా వింతధ్వని పలుకుతూవుంటే ఆ సవ్వడ్లు వింటూ ఆనందాన్ననుభవిస్తున్న శాంతికి తండ్రిమాటలు అంతగా రుచించలేదు.

"ఉండనివ్వు నాన్నా! దూడ మెళ్ళో మువ్వలు చాలా బాగున్నాయి."

"ఆ. ఆ. చాలాబాగున్నాయి. నువ్వు నాకు చెప్పేదానివయ్యావే" అని కసురుకున్నాడు రంగయ్య.

తండ్రి దూడపట్ల ఎందుకంతకోపంగా ఉన్నాడో చిన్నారి శాంతికి అర్థం కాలేదు. దూడ ఎంత తెల్లగా, బలంగా, ముద్దొచ్చేట్లుందో! అయినా దాన్ని చూచి ఎందుకంత కోపం? ఆ మాటే రహస్యంగా రామయ్య నడిగింది. రామయ్య అంత రహస్యంగానూ కారణం చెప్పాడు. కారణం విన్న శాంతి "ఓశ్ ఇంతేనా!" అనుకొని మెల్లగా రంగయ్యగారిని సమీపించి "నాన్నా" అని పిలిచింది. ఏమిటన్నట్లు చూశాడు రంగయ్యగారు.

"మరే నాన్నా! ఈ దూడ పెద్దదై ఈనితే అప్పుడు కోడెదూడను పెడుతుందిగా? అప్పటి వరకూ మనమే పెంచుకుందాం" రంగయ్యగారికా మాటలకు కొంచెం నవ్వొచ్చింది.

"చూడు శాంతీ! అది పెద్దదై ఈని పెయ్య దూడనే పెట్టొచ్చుగా. పెయ్యదూడైతే ఏమంత లాభముండదు. కోడెదూడైతే అన్నీ లాభాలే! సరే నీకర్థం కాదులే" అంటూ వరండాలో ఉన్న వాలు కుర్చీలో మేనువాల్చి చుట్ట ముట్టించటంలో నిమగ్నుడయ్యాడు.

"ఎవర్రా అది! రంగయ్యేనా!" అంటూ ప్రక్కింటి నాగయ్య చేతికర్ర ఆసరాతో రంగయ్య గారింటికొచ్చాడు.

"ఏమిటి పెదనాన్నా! ఇలా వచ్చావు!"

"ఏముందిరా! చెప్పుకుంటే సిగ్గుచేటు, రెండు రోజులయింది అన్నం తిని. కాస్త అన్నం పెట్టించుదూ" అని అడగలేక అడిగాడు నాగయ్య.


శాంతి వచ్చి నాగయ్యను లోపలికి తీసుకు వెళ్ళింది. నాగయ్య వెళ్ళిన వైపే చూస్తున్న రంగయ్యగారికి ఆయన తన చిన్నప్పుడు ఎలాంటి బ్రతుకు బ్రతికాడో గుర్తొచ్చింది.

నాగయ్యవాళ్ళది కాస్త కలిగిన కుటుంబమని చెప్పొచ్చు. కూతుళ్ళులేరుగానీ కొడుకులు నలుగురు. కొంచెం గారాబంగానే కొడుకుల్ని పెంచాడు నాగయ్య. అయితే వాళ్ళు పెరిగి చేతికి వచ్చారు అనుకున్న సమయంలో వాళ్ళ పెళ్ళిళ్ళు—జరగడం, కోడళ్ళు రావడం జరిగింది. ఆ సమయంలోనే భార్య పోవటం—ఇక అప్పటినుండే నాగయ్యకు అవస్థలూ మొదలయ్యాయి. ఏ కొడుకూ—కోడలూ కూడా ఒక పూట భోజనం పెట్టరు. "ఒక్క కూతురున్నా నాకీ బాధలుండవురా నాయనా!" అని అప్పుడప్పుడు రంగయ్యగారితో అంటూం టాడు. "పాపం! ఒక్క కూతురున్నా ఆయనకా గతి పట్టేదికాదేమో!" అని అనుకొన్నాడు

"దానిదేం భాగ్యం పెదనాన్నా! అన్నం పెట్టించమని నువ్వు నన్నడగాలేమిటి? ఇంట్లోకి వెళ్ళి నువ్వు పెట్టమంటే మాత్రం నీకోడలు పెట్టదూ?" అంటూ "అమ్మా! శాంతీ! తాతయ్య వచ్చాడు. అన్నం పెట్టమని చెప్పమ్మా మీ అమ్మతో" అని లోపలికి కేకవేశాడు—రంగయ్యగారు. కూతుళ్ళు తమను బాగుచేయరని-కొడుకులు బాగుచేస్తారని నమ్మకమేమిటి? ఎవరైనా వారి స్వభావాన్ని బట్టి ప్రవర్తిస్తారు. దీనికోసం కూతుళ్ళను చిన్న చూపు చూడటం—కొడుకుల్ని బాగా చూడటం బాగుండలేదు. అందర్నీ సమానంగా చూడటమే మంచిది. అంతేగానీ కొడుకేదో ఒరగబెడతాడని – వాడికే అన్నీ కట్టబెట్టడం మంచిది కాదు.

తనకు ముగ్గురు కూతుళ్ళు. ఒక్క కొడుకు. తను యింతకు ముందు రవిని మాత్రమే చదివించాలని అనుకున్నాడు. పెదనాన్న బాధ చూస్తూ, తెలిసి కూడా ఆలాంటి తెలివి తక్కువ పని తను చేయకూడదు. కొడుకును మాత్రమే చదివించి—కూతుళ్ళను కన్నందుకు పెళ్ళిచేసి చేతులు కడుక్కోకూడదు. వాళ్ళను కూడా చదివించి తనకు చేతనైనంతగా ప్రయోజకుల్ని చేయాలి. పేరు ప్రతిష్ఠలు తేవటానికి ఎవరైతేనేం అనుకున్నాడు. అంతలో ఆయనకు ఉదయం జరిగిన సంఘటన, తన ప్రవర్తన గుర్తొచ్చింది. ఆవును అమ్మితానంటే పాపం! శాంతి ఎంత చిన్నబుచ్చుకుందో! వెళ్ళి—అవును అమ్మనని శాంతిని బుజ్జగించాలి—అనుకుని, లేచి వెళ్తున్న రంగయ్యగారి ముఖంలో ఇదివరకెన్నడూ లేని తృప్తి కన్పించింది. □

అది 1949. విల్లీ అన్న 22 సంవత్సరాల అమెరికన్ యువకుడు హిమాలయాలలోని నందాదేవి శిఖరాన్ని చూసి దాని అందానికి ముగ్ధుడయ్యాడు. 'నాకో అమ్మాయి పుడితే నందాదేవి అని పేరు పెట్టుకుంటాను' అనుకున్నాడు. 1954 లో విల్లీకి ఒక ఆడపిల్ల పుట్టింది. అతను ఆమెకు 'నందాదేవి' అని పేరు పెట్టాడు. ఆమెకు కొండలెక్కడానికి తగిన శిక్షణ యిచ్చాడు.



జూలైలో కుమార్తెను తీసుకుని విల్లీ భారతదేశానికి వచ్చాడు. నందాదేవితోబాటు నందాదేవి శిఖరం ఎక్కడానికి పూనుకున్నాడు. దారిలో నందాదేవికి కడుపునొప్పి వచ్చింది. అయినా ఆమె పర్వతారోహణ చాలించలేదు. చివరికి సెప్టెంబరులో – నందాదేవి శిఖరం మరో 1600 అడుగుల దూరాన ఉందనగా ఆమె మరణించింది. తన కుమార్తె శవాన్ని నందాదేవి సమీపాన పూడ్చివచ్చిన విల్లీ "నా కుమార్తె మరణించడం – చాలా విషాదకరమైన విషయం. అయితే ఆమె తనకు ఇష్టమైన పని చేస్తున్నప్పుడు మరణించింది. అది చాలా గొప్ప విషయం!" అన్నాడు.